# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 5-4-2023 | RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 | ఎడిటర్:బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 177 | పేజీలు:6 | వెల: రూ.1/-


## తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు కూడా నకిలీ సర్టిఫికెట్లు : కేటీఆర్

హైదరాబాద్ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రధాని మోదీ ఏం చదివారో బయటపెట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో పలువురు బీజేపీ నేతల విద్యార్హతలు, వాళ్ల నకిలీ సర్టిఫికెట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో పలువురు బీజేపీ నేతల విద్యార్హతలపై మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీలో ఎంతోమంది మున్నాభాయి ఎంబీబీఎస్ ఉన్నట్లున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం నాడు ట్వీట్ చేశారు.తెలంగాణకు చెందిన ఇద్దరు బీజేపీ ఎంపీలు కూడా నకిలీ సర్టిఫికెట్లు కలిగి ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో తెలిపారు. వాళ్ల దగ్గర రాజస్థాన్, తమిళనాడు యూనివర్సిటీల పేరుతో నకిలీ సర్టిఫికెట్లు ఉన్నాయని అంటున్నారని పేర్కొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్ష

హైదరాబాద్ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); );: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. అందుబాటులో ఉన్న మంత్రులు, అధికారులతో కేసీఆర్ సమీక్షిస్తున్నారు. హుస్సేన్ సాగర్తీరంలోని ఎన్టీఆర్ గార్డెన్ వద్ద 125 అడుగుల ఎత్తులో అంబేద్కర్ విగ్రహాన్నిఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. అంబేద్కర్ విగ్రహా ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి కేసీఆర్సమీక్ష నిర్వహించారు. అందుబాటులో ఉన్న మంత్రులు, అధికారులతో కేసీఆర్ సమీక్షిస్తున్నారు. హుస్సేన్ సాగర్(తీరంలోని ఎన్టీఆర్ గార్డెన్ వద్ద 125 అడుగుల ఎత్తులో అంబేద్కర్ విగ్రహాన్నిఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. అంబేద్కర్ విగ్రహా ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి.ఏప్రిల్ 14న దేశంలోనే అతిపెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా దళిత బిడ్డలను హైదరాబాద్‌కు పిలిపించి.. లక్షలాది మంది మధ్య అంబేడ్కర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించనున్నారు. అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది.

## తెలంగాణలో మరో టెన్త్ పేపర్ లీక్

వరంగల్ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణలో మరో టెన్త్ పేపర్ లీక్ అయినట్లు వస్తున్న వార్తలు కలకలం రేపుతున్నాయి. వరంగల్‌లో పేపర్ లీక్ అయినట్టు ప్రచారం జరుగుతోంది. వరుసగా రెండో రోజు టెన్త్ హిందీ పేపర్ బయటకు వచ్చినట్లు సమాచారం. మంగళవారం ఉదయం 9–30 గంటలకు హిందీ పేపర్ బయటకు వచ్చి.. వాట్సాప్ గ్రూపు లో చక్కర్లు కొడుతున్నట్లు తెలుస్తోంది. వరుస పేపర్ లీక్ వార్తలతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇది ఆకతాయిలు చేసిన పనా?.. లేఖ నిజంగా పేపర్ లీక్ అయిందా? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం పేపర్ లీక్ అయినట్లు తమకు సమాచారం లేదని చెబుతున్నారు. అంతటా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. నిన్న కూడా వికారాబాద్ జిల్లాలో టెన్త్ పేపర్ లీక్ అయిన విషయం తెలిసిందే.ఇప్పటికే టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయాల్లో కుదిపేస్తోంది. ఈ క్రమంలో టెన్త్ పేపర్లు లీక్ అవుతున్నట్లు ప్రచారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారన్నది నిన్నటి టెన్త్ పేపర్ లీక్ ఘటనతో అర్థమవుతోంది. పూర్తి సమాచారం అందవలసి ఉంది.కాగా వరుసగా రెండో రోజు పేపర్ లీకేజితో స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వరంగల్ ఘటనపై డిఎస్ఈ నుంచి ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. వరంగల్ డిఈవో ఎంఈవో పై స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన సీరియస్ అయ్యారు. ఉద్దేశపూర్వకంగానే పేపర్లు బయటకు వస్తున్నాయని అధికారులు అనుమానిస్తున్నారు. వరంగల్ జిల్లా ఘటనపై స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విచారణకు ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారుల ప్రాథమిక సమాచారం ఆధారంగా చర్యలకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమవుతోంది.

## ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి కొప్పుల ఈశ్వర్




హైదరాబాద్, ఏప్రిల్ 4:అన్ని వర్గాల మాదిరిగానే ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ట్రాన్స్ ఉత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణలో మొదటిసారిగా ట్రాన్స్ ఉత్సవం జరుపుకోవడం ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం మన రాష్ట్రంలో సుమారు 58,918 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు తేలిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు సుమారు 400 మంది ట్రాన్స్ జెండర్ వ్యక్తులకు గుర్తింపు కార్డులు జారీ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇవ్వడానికి 19 మంది సభ్యులతో రాష్ట్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటుతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. ప్రతీ జిల్లా కేంద్రంలోనూ హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం మంచి నిర్ణయాలు తీసుకుంటుందని.. ఇందుకోసం అందరూ సహకరించాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, వికలాంగుల సంస్థ ఉన్నతాధికారులు భారతి హొలికేరి, దివ్యదేవారాజన్, శైలజతో పాటు పలువురు ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు

## భారత్‌లో కొనసాగుతోన్న కరోనా వైరస్ వ్యాప్తి

న్యూస్ డిల్లీ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్)భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. తాజాగా వరుసగా నాలుగో రోజూ మూడు వేలకు పైనే కొత్త కేసులు నమోదయ్యాయి. అయితే గత మూడు రోజులతో పోలిస్తే నేడు కొత్త కేసుల్లో కాస్త తగ్గుదల కనిపిస్తోంది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 1,64,740 మందికి కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయగా.. 3,038 కొత్త కేసులు బయటపడ్డాయి.దీంతో మొత్తం కరోనా బారిన పడిన వారి సంఖ్య 4,47,29,284కి చేరింది. ప్రస్తుతం దేశంలో 21,179 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇక ఇప్పటి వరకు కొవిడ్ 19 నుంచి 4,41,77,204 మంది కోలుకున్నారు. గత 24 గంటల వ్యవధిలో ఢిల్లీ, పంజాబ్, కేరళలో ఇద్దరు చొప్పున, జమ్మూ కశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్‌లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం తొమ్మిది మంది మృతి చెందారు. దీంతో దేశంలో కరోనా మహమ్మారి కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 5,30,901 కి చేరింది.ఇక ఇప్పటి వరకు నమోదైన పాజిటివ్ కేసుల్లో 0.05 శాతం యాక్టివ్‌గా ఉన్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. రికవరీ రేటు 98.76 శాతంగా, మరణాల రేటు 1.19 శాతంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 22.66 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

## విద్యార్థుల జీవితాలతో ఆడుకోకండి-మంత్రి సబిత విజ్ఞప్తి



హైదరాబాద్ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపలు సూచనలు చేశారు. అధికారులుఉపాధ్యాయులుబాధ్యతగా పని చేయాలన్నారు. కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. 4.95 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోవాలి. పరీక్షలు రాస్తున్న విద్యార్థులను గందరగోళానికి గురి చేయొద్దని మంత్రి కోరారు.పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పలు సూచనలు చేశారు. అధికారులుఉపాధ్యాయులుబాధ్యతగా పని చేయాలన్నారు. కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. 4.95 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోవాలి. పరీక్షలు రాస్తున్న విద్యార్థులను గందరగోళానికి గురి చేయొద్దని మంత్రి కోరారు. రాజకీయ స్వార్థం, వ్యక్తిగత స్వార్థం వీడాలన్నారు.వరంగల్ జిల్లాలో హిందీ ప్రశ్నాపత్రంబయటకు వచ్చిన అంశంపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరా తీశారు. నిజాలు తేల్చేందుకు సీపీకి ఫిర్యాదు చేయాలని వరంగల్, హనుమకొండ డీఈవోలకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వరంగల్ డీఈవో వాసంతి సీపీకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హిందీ క్వశ్చన్ పేపర్ ఏ స్కూల్ నుంచి బయటకు పంపించారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీపీ తెలిపారు.

## జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం : మంత్రి కొప్పుల



హైదరాబాద్, ఏప్రిల్ 4:జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను మంత్రి హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ పేరొందిన స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త అన్నారు. ఆయన సేవలు దేశానికి ఆదర్శమని, దళితుల కోసం పోరాడారన్నారు.

దళితుల కోసమే బతికారని, చివరి శ్వాస వరకు ప్రజాసేవలో తరించిన జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. భారత ప్రజలకు లభించిన అమూల్య రత్నమన్నారు. స్వతంత్ర భారత్‌ను ఈ దేశ సామాజిక స్థితిగతులకు సరిపోయేలా తీర్చిదిద్దడంలో బాబు జగ్జీవన్ రామ్ కృషి ఎంతో ఉందన్నారు. ఆయన దళితుల కోసం చేసిన సేవలు మరువలేనివని అన్నారు. స్వాతంత్ర సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, ప్రజా నాయకుడిగా జగ్జీవన్ రామ్ ప్రజలకు ఎప్పుడు గుర్తు ఉండిపోతారన్నారు.

## జనజీవన స్రవంతిలోకి రావడం అభినందనీయం : మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్ : మావోయిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసి, 17 సంవత్సరాలు జైలు జీవితం గడిపిన మాజీ మావోయిస్టు గజ్జల సత్యం రెడ్డి జనజీవన స్రవంతిలోకి రావడం అభినందనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని సత్యంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు .

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఏర్పాటు కోసం చేసిన ఉద్యమం అనుభవాలు,రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చాక జరిగిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను మంత్రి ఆయనకు వివరించారు. అటువంటి తెలంగాణా పునర్నిర్మాణంలో మీరు కూడా భాగస్వామ్యం కావాలని సత్యం రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహా రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత నామిరెడ్డి యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధిలో భారీ మార్పు : మాజీ మావోయిస్టు

తెలంగాణ ఏర్పాటుకు ముందు, తరువాత రాష్ట్రంలో భారీ మార్పు సంభవించిందని మాజీ మావోయిస్టు సత్యం రెడ్డి అన్నారు. ఉద్యమంలోకి వెళ్లేముందు ఉన్న తెలంగాణకు ఇప్పటి తెలంగాణ కు అసలు పోలికే లేదని చెప్పారు. అన్ని రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఉద్యమం లో ఉన్నప్పుడు ఉత్తరాది రాష్ట్రాలు చూశానని ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి ఆయా రాష్ట్రాలలో లేదని ఆయన అన్నారు.

## టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో ముస్లిం కుటుంబాలకు కొత్త బట్టలు పంపిణి



రాజేంద్రనగర్ ఏప్రిల్ 4 రాబోయే ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) సందర్భంగా, హైల్ టాటా మణి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.జ్యోతి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ చింతల్ మెట్ లో నిరుపేద ముస్లిం కుటుంబాలకు పి.జగదీష్ కుమార్ సహకారం తో (కుటుంబంలో 20 మంది సభ్యులు) కొత్త బట్టలు బహుకరించారు. ఈ సందర్భంగా కె.జ్యోతి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక వేలమంది ఆకలిని తీర్చామని, నిత్యావసర సరుకులు అందజేస్తూ, పేదల అత్యవసరాలను తీర్చేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నిస్వార్థంగా పేదలకు సేవ చేస్తున్న, తమ సంస్థకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పేదల అవసరాలు తీర్చడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ లేదని ఈ సందర్భంగా ఆమె తన సంస్థ కార్యకలాపాలను గూర్చి వివరించారు.ఈ కార్యక్రమం లో పి.ఉషా రాణి. పి.విన్య మణి సూర్య. కె.ప్రవీణ్ కుమార్ జగదాంబ. ప్రేమలత. బి.శ్రీనివాస రెడ్డి. సునీత రెడ్డి. జి.రాజు కల్పనా రెడ్డి. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలపై మంత్రి దయాకర్‌రావు సమీక్ష



హైదరాబాద్, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష నిర్వహించారు. పార్టీ శ్రేణులను ప్రత్యేకంగా కలుసుకొని వారితో మాట్లాడి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధిని వివరించడంతో పాటు ఇంకా జరగాల్సిన పురోగతిపై చర్చించి, సమస్యలను పరిష్కరించడానికే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మీయ సమ్మేళనాలకు పార్టీ శ్రేణుల నుంచే కాక ప్రజల నుంచి సైతం మంచి స్పందన వస్తుందని ఆయన వివరించారు.

పాలకుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో మండల కేంద్రంలో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడు తూ.. ఇప్పటి వరకు పాలకుర్తి నియోజకవర్గం లో నిర్వహిం చిన పలు ఆత్మీయ సమ్మేళనాలకు పార్టీ శ్రేణుల నుంచి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినట్లు చెప్పారు. త్వరలో పాలకుర్తి మండలంలో నిర్వహిం చనున్న టిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలకు చేయాల్సిన ఏర్పాట్లపై, నిర్వహించాల్సిన గ్రామాలపై, అలాగే సమ్మేళనాలు నిర్వహించే పద్ధతిపై మంత్రి ఎర్రబెల్లి పార్టీ ముఖ్య నాయకులకు వివరించారు. పెద్ద గ్రామాలైతే ఒకటి రెండు గ్రామాలకు మించకుండా సమావేశాలు నిర్వహించాలని ఒకవేళ చిన్న గ్రామాలు ఉంటే మూడు నుంచి నాలుగు గ్రామాల వరకు ఎంపిక చేసుకుని ఏదో ఒక గ్రామంలో ఈ సమ్మేళనాలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ బాధ్యులు ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అలాగే పార్టీకి చెందిన అనుబంధ సంఘాల నాయకులు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఆసక్తిగా వచ్చే ప్రజలను అనుమతించాలని, ఆ రోజు భోజనాలు వడ్డించి అందరినీ ఆత్మీయంగా పలకరించాలని మంత్రి సూచించారు.

## చంద్రుడి మీదకు మళ్లీ వ్యోమగాములను పంపనున్న నాసా

న్యూయార్క్ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: చంద్రుడిమీదకు నాసామళ్లీ వ్యోమగాముల్నిపంపనున్నది. వచ్చే ఏడాది నవంబర్‌లో ఆర్టెమిస్–2లూనార్ రాకెట్ ద్వారా ఆ ఆస్ట్రోనాట్స్ వెళ్లనున్నారు. అయితే ఆ నలుగురు వ్యోమగాముల పేర్లను సోమవారం నాసా ప్రకటించింది. రీడ్ వైజ్‌మాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెర్మీ హాన్‌సేన్‌లు చంద్రుడిపైకి వెళ్లనున్నారు. రీడ్, విక్టర్‌లు నాసాకు చెందిన వాళ్లు కాగా, క్రిస్టినా, జెర్మీలు కెనిడియన్ స్పేస్ ఏజెన్సీ వ్యోమగాములు.ఆర్టెమిస్–2 మిషన్‌కు వైజ్‌మాన్ కమాండర్‌గా సర్వ్ చేయనున్నారు. 47 ఏళ్ల వైజ్‌మాన్ నేవీలో పైలెట్‌గా చేశారు. బాల్టిమోర్‌కు చెందిన అతను గతంలో అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు వెళ్లారు. 47 ఏళ్ల హాన్‌సన్ ఓ ఫైటర్ పైలెట్. 2009లో ఆస్ట్రోనాట్ ట్రైనింగ్ కోసం కెనడా స్పేస్ ఏజెన్సీ అతన్ని తీసుకున్నది. డీప్ స్పేస్‌లోకి వెళ్లనున్న తొలి కెనడా వ్యోమగామిగా ఆయన నిలుస్తారు. 46 ఏళ్ల గ్లోవర్ రెండేళ్ల క్రితం స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్‌కు పైలెట్‌గా చేశారు. సపేస్ స్టేషన్‌లో ఆర్నెళ్లు కూడా ఉన్నాడు.మూన్ మిషన్‌లో ఉన్న ఏకైన మహిళా ఆస్ట్రోనాట్ క్రిస్టినా కోచ్ వయసు 44 ఏళ్లు. ఇప్పటి వరకు ఆమె ఆరుసార్లు స్పేస్‌వాక్‌లో పాల్గొన్నది. 328 రోజుల పాటు స్పేస్‌లో ఉన్న రికార్డు ఆమె పేరిట ఉంది. మిచిగన్‌కు చెందిన ఆ వ్యోమగామి ఏడాది పాటు దక్షిణ ధ్రువంలో కూడా గడిపారు.

### నేటి కందం- నేటికి అందం



–రాధశ్రీ

(ఏప్రిల్ 5 మనస్సాక్షి దినోత్సవం....)

సెల్:9494481210






# నూతన వీధి వ్యాపారుల ప్రాంగణం స్ట్రీట్ వెండర్ మార్కెట్ పనులు పరిశీలన



ఖమ్మం,ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ తర్వాత ఖమ్మం నగరం ముందున్నది. రాష్ట్ర ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర మున్సిపల్ మరియు ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చూపుతున్న చొరవతో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనల మేరకు ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని మూడవ పట్టణం ప్రాంతంనందు నూతనంగా ఏర్పాటు చేసిన వీధి వ్యాపారుల ప్రాంగణం స్ట్రీట్ వెండర్ మార్కెట్ ను మంగళవారం ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ,ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి సందర్శించి అక్కడ జరిగే పనులను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసి స్ట్రీట్ వెండర్ మార్కెట్ 3వ పట్టణ ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

# బైంసాలో డబుల్ ట్రబుల్..! స్థలాలు మావి.. ఇండ్లు వేరే వాళ్లకా..!

ఆదిలాబాద్ , ఏప్రిల్ 4: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో కొనసాగుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఎంపికలో తమకు అన్యాయం జరుగుతుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల స్థలాలలో ప్రస్తుత డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారని, ఇప్పుడు స్థలాలు ఇచ్చిన మాకే ఇండ్లు ఇవ్వడం లేదంటూ ఆందోళనకు దిగారు. ఇప్పటి బీఆర్ఎస్ సర్కార్ వాటిని రద్దు చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినా? ఈరోజు ఇల్లు కేటాయించకపోవడంతో హామీ కాస్త తుంగలో తొక్కారాని మండిపడ్డారు. ప్రస్తుత డబుల్ బెడ్ రూమ్స్ లిస్టులో తమ పేర్లు లేవని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక గార్డెన్ సమీపంలో ఆందోళనకు దిగగా ఆందోళనకారులకు పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. మా స్థలాలు మాకు కావాలని ఆచేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల స్థలాల బాధితులకు ఎట్టకేలకు నిరాశ మిగిలింది. స్థలాలు మాయి ఇండ్లు వేరే వాళ్లకు అంటూ పలువురు రోదనలు మిన్నంటాయి.

# ప్రధాని నరేంద్ర మోదీ డిగ్రీ సర్టిఫికెట్ నకిలీదా!

న్యూ డిల్లీ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ప్రధాని నరేంద్ర మోదీడిగ్రీ సర్టిఫికెట్ వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆయన డిగ్రీ సర్టిఫికెట్‌ఫేక్ అంటూ ఆమ్ ఆద్మీ పార్టీనేతలు రోజుకో ఆధారంతో ముందుకు వస్తున్నారు. ప్రధాని మోదీ తనకుతానుగా పాఠశాల విద్య తర్వాత చదువుకోలేదని చెప్పే వీడియోను వైరల్ చేయడమే కాకుండా.. 2016లో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలు మీడియా ముందు పెట్టిన ప్రధాని మోదీ ఎంఏ సర్టిఫికెట్‌కు ఇప్పుడు ఆప్ నేతలు శల్యపరీక్షలు నిర్వహించారు. అది ముమాటికీ ఫేక్ సర్టిఫికెట్ అంటూ ఘంటాపథంగా చెబుతున్నారు.

**ఏమిటీ వివాదం?**

2019 సార్వత్రిక ఎన్నికలసమయంలో గుజరాత్‌లోని వాద్‌నగర్, ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీ లోక్‌సభ స్థానాల నుంచి నరేంద్ర మోదీ బీజేపీ తరఫున ప్రధాని అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగారు. ఆ సమయంలో రెండుచోట్లా సమర్పించిన అఫిడవిట్లలో.. తాను గుజరాత్ విశ్వవిద్యాలయంనుంచి పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. గుజరాత్ వర్సిటీకి సంబంధించిన సర్టిఫికెట్‌పై మరింత సమాచారం కావాలంటూ ఆప్ నేతలు ఆ విశ్వవిద్యాలయానికి సమాచార హక్కు చట్టంకింద దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమాచారం అందకపోవడంతో ప్రధాన సమాచార కమిషనర్ వద్ద అప్పీల్.. ఆ తర్వాత గుజరాత్ హైకోర్టులో విచారణ జరిగాయి. కోర్టు తీర్పు ఆప్‌కు వ్యతిరేకంగా రావడంతో.. ఇప్పుడు ఆ పార్టీ నేతలు ప్రధాని డిగ్రీ సర్టిఫికెట్‌పై ప్రత్యక్ష దాడికి సిద్ధమయ్యారు.

**ఫాంట్‌తో సహా ఆధారాలను వెలికితీసి..**

ఆప్ అధికార ప్రతినిధిరాజ్యసభ సభ్యుడుసంజయ్‌సింగ్ ఏకంగా ప్రధాని పీజీ సర్టిఫికెట్‌లో తప్పులను బహిర్గతం చేస్తూ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ సర్టిఫికెట్‌లో 'యూనివర్సిటీఅనే పదం తప్పు(యూనిబర్సిటీ– గా ఉందని చూపించారు. అంతేకాకుండా.. 'మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్' అని పేర్కొన్న ఫాంట్1992లో ఉనికిలోకి వస్తే.. ఆయన పీజీ పూర్తిచేసింది 1983లో కావడం అది ఫేక్ సర్టిఫికెట్ అని సాంకేతికంగా నిరూపిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. "ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ డిగ్రీ సర్టిఫికెట్ ఫేక్ అని తేలితే.. కేంద్ర ఎన్నికల సంఘంనిబంధనల ప్రకారం ప్రధాని మోదీ తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతారన్నారు.అంతేకాకుండా.. తప్పుడు అఫిడవిట్ సమర్పించినందుకు తదుపరి ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై అనర్హత ఉంటుందని వివరించారు.

మోదీ పాత ప్రసంగాల్లో..

ంఖ ప్రధాన అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్‌కూడా మోదీ డిగ్రీ సర్టిఫికెట్ నకిలీదేనంటూ పలు ఆధారాలను మీడియా ముందు పెట్టారు. "నరేంద్ర మోదీ ప్రధాని కాకమునుపు.. గుజరాతలో జరిగిన ఎన్నికల సమయంలో ఆయన తాను పాఠశాల తర్వాత విద్యను కొనసాగించలేదని చెప్పారు. ఆ వీడియో ఆధారాలున్నాయి. ఆ వ్యాఖ్యనే సెంటిమెంట్‌గా చేసుకుని మోదీ సీఎం అయ్యారు. అలాంటిది ఆయన 1979లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి బీఏ, 1983లో గుజరాత్ వర్సిటీ నుంచి ఎంఏ ఎలా పూర్తిచేయగలిగారు?" అని సౌరభ్ నిలదీశారు. ఈ ఆధారాలన్నీ ప్రధాని నరేంద్ర మోదీది ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్ అని నిరూపిస్తున్నాయని, ఆయనపై అనర్హత వేటు తథ్యమని ఆయన వ్యాఖ్యానించారు.

అనర్హత సాధ్యమేనా?

ఒక లోక్‌సభ సభ్యుడిపై అనర్హత వేటును ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 లోని సెక్షన్ 8 ప్రస్తావిస్తోంది. ఈ సెక్షన్‌లోని క్లాజులు నేరాలు నిరూపితమై.. రెండేళ్లకు పైగా జైలు శిక్ష పడితే.. సభ్యత్వం కోల్పోతారని స్పష్టం చేస్తోంది. అయితే.. ఇందులో ఎక్కడా ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారాన్ని అందజేస్తే అనర్హత వేటు పడుతుందని చెప్పలేదు. ఇదే చట్టంలోని సెక్షన్ 125(ఏ) తప్పుడు అఫిడవిట్లను గురించి ప్రస్తావిస్తోంది. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే.. ఆర్నెల్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చని స్పష్టం చేస్తోంది. ఎన్నికల కమిషన్ కూడా పలుమార్లు కోర్టుల్లో ఈ విషయాన్ని పేర్కొన్నాయి. 2018లో ఎన్నికల కమిషన్‌తోపాటు.. సుప్రీంకోర్టు కూడా తప్పుడు అఫిడవిట్‌కు శిక్షలు పడేలా చట్టాలు చేయాలని పార్లమెంటును కోరినా.. ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు. దీన్ని బట్టి.. ఒకవేళ ఎన్నికల అఫిడవిట్‌లో ప్రధాని మోదీ తప్పుడు సమాచారం అందించారని ప్రాసిక్యూషన్ లేదా దర్యాప్తు సంస్థలు తేల్చినా.. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం అనర్హత ఉండబోదని స్పష్టమవుతున్నట్లు రాజ్యాంగ/న్యాయ నిపుణుడు మెన్నేని సంతోష్ రావు మీడియా తో పేర్కొన్నారు.

# ఎన్ఈఐడీఎస్ కింద పెట్టుబడులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:ఈశాన్య ప్రాంత పారిశ్రామిక అభివృద్ధి పథకం (ఎన్ఈఐడీఎస్) 2017ను పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహ విభాగం (డీపీఐఐటీ) అమలు చేస్తోంది. 01.04.2017 నుంచి అమల్లోకి వచ్చేలా 12.04.2018న ఈ పథకాన్ని నోటిఫై

చేశారు. ఎన్ఈఐడీఎస్–2017 కోసం దరఖాస్తుల ప్రక్రియ 31.03. 2022న ముగిసింది. ఈ పథకం కింద, సుమారు రూ. 10117.50 కోట్ల పెట్టుబడుల కోసం 1211 దరఖాస్తులు అందాయి. వీటిలో, ఇప్పటి వరకు రూ. 7551.12 కోట్ల పెట్టుబడితో 926 అర్హత కలిగిన పారిశ్రామిక కేంద్రాలు (షరతులతో కూడిన నమోదులతో సహా) నమోదయ్యాయి.

ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి లోక్‌సభలో ఈరోజు లిఖితపూర్వక సమాధానం రూపంలో ఈ సమాచారాన్ని తెలిపారు.

## యాపిల్ ఐఫోన్, యూజర్లకు..

# భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ హెచ్చరికలు



న్యూ డిల్లీ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );యాపిల్ ఐఫోన్, వాచ్, మ్యాక్ ఆపరేటింగ్ సిస్టం యూజర్లకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక) మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆయా ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ఉన్న లొసుగులు/లోపాలు/ వల్నరబిలిటీస్కారణంగా హ్యాకర్లు యాపిల్ డివైజ్లలో చొరబడే ప్రమాదముందంటూ హైలెవల్ సెక్యూరిటీ వార్నింగ్ను జారీ చేసింది. మ్యాక్ కంప్యూటర్లు యాపిల్ చేతి గడియారాలుయాపిల్ టీవీలులో సైబర్ సెక్యూరిటీపరంగా ఉన్నట్లు తెలిపింది. ఈ లోపాల కారణంగా యాపిల్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్లు తస్కరించే ప్రమాదముందని వెల్లడించింది. ఈ మేరకు సెర్ట్ తన వెబ్‌సైట్‌లో హెచ్చరికలను పోస్ట్ చేసింది. ఈ సమస్యను అధిగమించేందుకు ఆయా డివైజ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

ఐఫోన్, వాచ్‌లలో ఇలా..

మాక్ ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ఉన్న సఫారీ వెబ్ బ్రౌజర్‌లో ఈ వల్నరబిలిటీలు ఉన్నట్లు వెల్లడించింది. ఆ బ్రౌజర్‌లోని వెబ్‌కిట్‌లో ఉన్న లొసుగులను హ్యాకర్లు ఆసరాగా చేసుకుని, యాపిల్ వాచ్‌లలోకి, ఐఫోన్లలోకి రిమోట్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్ద్వారా చొరబడే ప్రమాదముందని తెలిపింది. సఫారీ బ్రౌజర్ 16.4 వెర్షన్(కు అప్‌గ్రేడ్(అవ్వడం ఒక్కటే మార్గమని సూచించింది. అందుకోసం యాపిల్ యాప్‌స్టోర్‌లో డెస్క్‌టాప్ యాప్ లోని యాప్‌స్టోర్ టూల్‌బార్‌లో కనిపించే అప్‌డేట్స్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలని వివరించింది.

మ్యాక్ ఆపరేటింగ్ సిస్టమ్ యూజర్లకు..

ఐఫోన్లతో పోలిస్తే.. మ్యాక్ ఆపరేటింగ్ సిస్టమ్ ఉన్న ల్యాప్‌టాప్‌లలోకి, కంప్యూటర్లలోకి హ్యాకర్లు చొరబడే ప్రమాదం ఎక్కువ అని సెర్ట్–ఇండియా హెచ్చరించింది. ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌లో పలు రకాల వల్నరబిలిటీస్ ఉన్నట్లు తెలిపింది. దీని వల్ల మెమొరీ సమస్యలు, ఇన్‌పుట్/ ఔట్‌పుట్ పనితీరు అస్తవ్యస్థంగా తయారవ్వడం, కర్నల్ సమస్యలు బౌండ్ చెకింగ్ లో దారుణ ఫలితాలు, ప్రైవసీ సమస్యలులాజిక్ సమస్యలువస్తాయని వివరించింది. హ్యాకర్లకు నేరుగా చొరబడి, సమాచారాన్ని తస్కరించడం, మార్చడం చేసే వెసులుబాటు కలుగుతుందని స్పష్టం చేసింది. మ్యాక్ ఓఎస్ వెంచురావెర్షన్ 13.3 కంటే పాత వెర్షన్‌లలో ఈ సమస్య ఎక్కువగా ఉందని తెలిపింది. అదేవిధంగా మ్యాక్ ఓఎస్ బిగ్ సర్) వెర్షన్ 11.75, మ్యాక్ ఓఎస్ మోనిటరీ వెర్షన్ 12.6.4 కంటే పాత వెర్షన్‌లు వాడుతున్న వినియోగదారులు వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

# రైలు ప్రయాణికులపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన వెనుక కుట్ర

కేరళ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కేరళలోని అలప్పుళ– కన్నూర్ ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదివారం రాత్రి ఓ దుండగుడు ప్రయాణికులపై పెట్రోల్ పోసి, నిప్పు పెట్టడం వెనుక ఉగ్రకుట్ర ఉందా? టెర్రరిస్ట్ మాడ్యూల్స్ ప్రోద్బలంతోనే అనుమానితుడు ఫారూఖ్ సైఫీ ఈ ఘాతుకానికి ఒడిగట్టాడా? పోలీసులు కూడా ఉగ్రవాద కోణాన్ని కొట్టిపారేయలేమని చెబుతున్నారు.

**ఏం జరిగింది ?**

ఆదివారం రాత్రి 9.30 సమయంలో అలప్పుళ – కన్నూర్ ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్ రైలునగరాన్ని దాటి కోరపుళరైల్వే వంతెన వద్దకు చేరుకోగానే ఓ వ్యక్తి తన వెంట బాటిళ్లలో తెచ్చుకున్న పెట్రోల్‌ను తోటి ప్రయాణికుడిపై పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. చూస్తుండగానే ఆ మంటలు ఇతరులకు అంటుకున్నాయి. దీంతో భయపడి చిన్నారితోపాటు ఓ మహిళ, ఓ యువకుడు కదులుతున్న రైల్లోంచి దూకేశారు. ఆ ముగ్గురూ చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈలోగా.. అప్రమత్తమైన ప్రయాణికులు కకావికలమైఎమర్జెన్సీ చైన్‌ను లాగి, రైలును నిలిపివేశారు. రైలు ఆగగానే దుండగుడు పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఎవరా దుండగుడు?

సంఘటనాస్థలికి సమీపంలో పోలీసులు నిందితుడిదిగా అనుమానిస్తున్న ఓ బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అందులో పెట్రోల్ సీసాసిమ్‌కార్డులు లేని రెండు మొబైల్‌ఫోన్లు, హిందీ, ఇంగ్లిష్‌లో ఉన్న పలు డాక్యుమెంట్లు లభ్యమయ్యాయి. వాటి ఆధారంగా నిందితుడి పేరు ఫారూఖ్ సైఫీఅని, అతడి స్వస్థలం నోయిడాఅని గుర్తించారు. ఫారూఖ్ ప్రస్తుతం కోళికోడ్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా, కార్పెంటర్‌గా పనిచేస్తున్నట్లు నిర్ధారించారు. ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్న ఆనవాళ్లను బట్టి.. అతడి ఊహాచిత్రాన్ని రూపొందించి, మీడియాకు విడుదల చేశారు.

**ఉగ్ర కుట్రపై ఆధారాలు..?**

నిందితుడు ఫారూఖ్ అలప్పుళ–కన్నూర్ ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో ప్రయాణించాడు. ఘటన జరిగింది డీ1 ఎగ్జిక్యూటివ్ బోగీ. ఈ బోగీలో ప్రయాణికుల పేర్లను ముందే గుర్తించిన ఫారూఖ్.. పక్కా వ్యూహంతోనే ఈ దాడికి పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసింది. సిట్ అధికారిగా మళప్పురం క్రైమ్‌బ్రాంచ ఎస్పీ పి.విక్రమన్‌ను నియమించింది. ఈ బృందంలో యాంటీ టెర్రరిజం స్క్వాడ్(యా) డీఎస్పీ బైజోపాలోస్ కూడా ఉన్నారు. దీన్ని బట్టి.. ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు ఉగ్ర కుట్రను గుర్తించారని, అందుకే ఏటీఎస్ అధికారిని కూడా రంగంలోకి దింపారని స్పష్టమవుతోంది. 1997లో కూడా కేరళలోని త్రిషూర్‌లో రైలులో బాంబు పేలుడు ఘటన జరిగింది.

దేశంలోని పలుప్రాంతాల్లోనూ రైళ్లలో బాంబు దాడి ఘటనలు నమోదయ్యాయి. రైలులో మంటలు రేగితే.. దాని వేగానికి గాలి తోడవ్వడంతో వేగంగా ఇతర బోగీలకు వ్యాప్తిచెందుతాయని.. అందుకే ఉగ్రవాదులు ఇలాంటి చర్యలకు ఒడిగడతారని పోలీసులు చెబుతున్నారు. ఫారూఖ్ కూడా ఎగ్జిక్యూటివ్ బోగీలోకి చొరబడగానే.. మారుమాట్లాడకుండా.. అక్కడ ఉన్నవారిపై పెట్రోల్ చల్లి, నిప్పంటించడం కూడా 'లోన్ వోల్ఫ్ టెర్రర్ అటాక్ లాంటిదేనని వివరిస్తున్నారు. పైగా.. నిందితుడు రైలు ఆగగానే దిగి మెయినరోడ్ వైపు వెళ్లాడని, అప్పటికే అక్కడ వేచి ఉన్న ఓ వ్యక్తి బైకు ఎక్కి పరారయ్యాడని ప్రత్యక్ష సాక్షులుచెబుతున్నారు. దీన్ని బట్టి ఈ దాడి పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిందేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

కన్నూరులో ఉగ్ర మూలాలు..!

కేరళలోని కన్నూరులో పలు సందర్భాల్లో ఉగ్రవాద మూలాలు బయటపడ్డాయి. ఇప్పుడు ఘటన జరిగింది కూడా అలప్పుళ–కన్నూరు ఎగ్జిక్యూటివ్ ఎక్స్‌ప్రెస్ రైలులో కావడంతో సిట్ ఉగ్రకోణంపై దృష్టిసారించింది. 1998లో కోళికోడ్‌లో తమిళనాడు బస్సు దహనం కేసులో నిందితుల మూలాలు కన్నూర్‌లోనే బయటపడ్డాయి. ఆ తర్వాత కన్నూర్ నుంచి హైదరాబాద్ వచ్చి, ఇక్కడ తలదాచుకుంటూ ఉగ్రవాద కుట్రలు పన్నిన తోడల్లుళ్లు అబ్దుల్ సత్తార్, అబ్దుల్ జబ్బార్, టి.నసీర్ దేశంలోని పలు ప్రాంతాల్లో విధ్వంసాలకు కుట్రపన్నారు.

అబ్దుల్ సత్తార్, జబ్బార్‌ను కర్ణాటక పోలీసులు 2009లో బెంగళూరు పేలుళ్ల కేసులో అరెస్టు చేయగా.. బంగ్లాదేశ్‌లో తలదాచుకున్న నసీర్‌ను చిట్టాగాంగ్‌లోని ఓ దర్గా వద్ద ఇంటర్‌పోల్ సాయంతో అరెస్టు చేశారు. వీరిలో సత్తార్‌కు.. ఇండియన్ ముజాహిదీన్(ఐఎం) మాస్టర్‌మైండ్ రియాజ్ భత్కల్ – (ప్రస్తుతం పాకిస్థానలో ఉన్నాడు)తో సంబంధాలున్నట్లు కర్ణాటక పోలీసుల దర్యాప్తులో తేలింది. అంతేకాదు.. 2007–10 మధ్యకాలంలో కన్నూరులోని కొబ్బరి చెట్లపైన ఉగ్రమూకలు దాచిన ఏకే–47 తుపాకులు, పేలుడు పదార్థాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా చోటుచేసుకున్న అలప్పుళ–కన్నూరు రైలు ఘటనలోనూ కన్నూరు మాడ్యుల్ ఉగ్రవాదుల హస్తం ఉండి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

# టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలపై విచారణ జరపండి - సిబిఐకి కాంగ్రెస్ వినతి..

హైదరాబాద్, ఏప్రిల్ 4:

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీలపై విచారణ జరపాలని కోరుతూ హైదరాబాద్ కోఠిలోని సీబీఐ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత మల్లు రవి నేతృత్వంలో సీబీఐ అధికారులకు కాంగ్రెస్ నేతలు ఈ మేరకు ఒక లేఖ అందించారు.. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ, ప్రశ్నాపత్రాలు లీకేజీ కారణంగా 30 లక్షల మంది నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కోచింగ్ సెంటర్‌లలో లక్షల రూపాయలు ఖర్చు చేశారని.. 2014 నుంచి ప్రిపేర్ అవుతుంటే నోటిఫికేషన్‌లు ఇప్పుడే వచ్చాయని ఆయన తెలిపారు. ఇన్విజిలేటర్‌లు కూడా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే వుండటం వల్ల చివరకు పదోతరగతి పరీక్ష ప్రశ్న పత్రాలు కూడా లీక్ అవుతున్నాయని ఆయన ఆరోపించారు.

యూత్ కాంగ్రెస్ ఆందోళన చేస్తే పోలీసులు నాన్‌బైలబుల్ కేసులు పెట్టి జైలులో పెట్టారని మల్లు రవి అన్నారు. ప్రభుత్వం లీకులను అరికట్టాలంటే అరెస్ట్‌లు చేస్తోందని.. జైళ్లు, శిక్షలతో కాంగ్రెస్ పోరాటం ఆపదన్నారు. సెక్రటేరియట్, ప్రగతి భవన్‌లను ముట్టడిస్తామని హెచ్చరించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై వేసిన సిట్ కూడా పెద్దవాళ్లను కాపాడేందుకేనని ఆయన ఆరోపించారు. సీబీఐ తో విచారణ జరిపితే నిజాలు బయటకు వస్తాయన్నారు. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్, సభ్యులను రద్దు చేసి కొత్త వాళ్ళతో పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సీబీఐ తో కానీ , సిట్టింగ్ జడ్జి తో కానీ విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. కాగా, పేపర్ లీకేజ్ లో కోట్లాది రూపాయిలు చేతులు మారాయని అంటూ రెండ్రోజుల క్రితం ఈడీ అధికారులకు , ఎసిబికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది.

# ఎల్లమ్మకు డాక్టర్ గోలి మోహన్ ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ ఎల్లమ్మ సిద్ధోగానికి డాక్టర్ గోలి మోహన్ విచ్చేశారు.

ఈ సందర్భంగా గౌడ సంఘ యువకులు, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ గోలి మోహన్ ని సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోలి మోహన్ అమ్మవారిని దర్శనం చేసుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు

. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ డాక్టర్ గోలి మోహన్ వేములవాడ నియోజవర్గంలో ఎంతోమంది యువతకు మార్గదర్శకులుగా నిలవడం అభినందనియమని అన్నారు. డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లిదీవెనలు ప్రజాలందరిపై ఉండాలని కోరుకున్నారు. రాబోయే రోజుల్లో ఈ సిద్ధోగం మరింత ఘనంగా జరగడానికి తన వంతు సహకారాలు అందిస్తానని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ గోలి మోహన్ ని శాలువాతో సత్కరించారు.

# ప్రైవేటు రంగంలో ఎస్సి, ఎస్టి, బిసిలకు రిజర్వేషన్లు పెట్టాలి

## - వందలాది మందితో దద్దరిల్లిన జంతర్ మంతర్




న్యూ డిల్లీ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పార్లమెంట్ లో బి.సి బిల్లు పెట్టి చట్టసభలలో బి.సిలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలోఎస్సి,ఎస్టి,బిసి లకు రిజర్వేషన్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో డిల్లీలోని పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరిపారు. వందలాది మంది సర్పంచులు, జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పార్లమెంట్ కు రావడంతో జంతర్ మంతర్ దద్దరిల్లిపోయింది. పెద్ద ఎత్తున వచ్చిన వీరిని కంట్రోల్ చేయడానికి పోలీసులకు ఇబ్బంది కలిగింది. "ఓట్లు బి.సి లవి ? సీట్లు అగ్రకులాలకా ! ? రాజ్యాధికారంలో వాటా కావలి" అంటూ నినాదాలు చేశారు. ఈ మహా ప్రదర్శనకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘ కన్వీనర్ లాల్ కృష్ణ – జాతీయ బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం నాయకత్వం వహించారు. ఈ ప్రదర్శనుద్దేశించి గుజ్జ కృష్ణ, కర్రీ వేణుమాధవ్, నీల వెంకటేష్, జి. అంజి తదితరులు ప్రసంగించారు. ధర్నానుద్దేశించి ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టి ఆఘ–మేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు పెట్టారు. కాని బి.సి లకు చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని 30 సం.రాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ దేశంలో బి.సి లను బిచ్చగాళ్ళను చేశారని విమర్శించారు. బి.సిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండ గొర్రెలు ? బర్రెలు ?పందులు ? పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని బి.సిలను శాశ్వత బిచ్చగాళ్ళను చేస్తున్నారని విమర్శించారు. బి.సి.ల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్ల పై ఉన్న క్రిమి లేయర్‌ను తొలగించాలని, బి.సి.లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. బీసీల అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలని, ఎస్సీ /ఎస్టీ అట్రా సిటీ యాక్ట్ మాదిరిగా బి.సి.లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బి.సి. యాక్టు తీసుకురావాలని, ప్రపంచీకరణ సరళీకృత, ఆర్థిక విధానాలు రావడం పారిశ్రామికీకరణ వేగవంతంగా జరగడం ప్రైవేటు రంగంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయి. అందుకే ఎస్సీ/ఎస్టీ /బి.సి.లకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని కోరారు. సుప్రీం కోర్టు–హై కోర్టు జడ్జీల నియామకాలలో ఎస్సీ/ ఎస్టీ బి.సి.లకు రిజర్వేషన్లు పెట్టాలని, కేంద్రంలో బి.సి.లకు పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్ షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ స్కీము విధానం సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలి. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్ బి.సి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కల లో బి.సి. కులాల వాది లెక్కలు సేకరించాలని కోరారు.ఈ మహాధర్నాలో భూపేసాగర్, ఈ మహా ధర్నాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం,డిల్లీ ఇంచార్జ్ కర్రి వేనుమాదవ్, తెలంగాణా రాష్ట్ర కన్వినర్ లాల్ కృష్ణ, తెలంగాణా బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్, బిసి ఇక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య,నిరుద్యోగ జేఏసి చైర్మెన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణపు శ్రీనివాస్, నల్లగొంగ జిల్లా అధ్యక్షులు దుడుక లక్ష్మి నారాయణ, బిసి విద్యార్థి సంఘం తెలంగాణా అధ్యక్షులు అంజి, బిసి విద్యార్థి సంఘం తెలంగాణా వర్కింగ్ ప్రిసిడెంట్ బోల్కం వెంకట్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వేముల రామ కృష్ణ, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.రామరాజు వర్మ,సందీప్ గౌడ్, హరీష్ యాదవ్, తిరుపతి, సైదులు, నతీష్, నాగరాజు, రామస్వామి, బోయిన్ వృద్వి, రామరాజు, రాజేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత.. కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 4:బీఆర్ఎస్ పై, కేసీఆర్ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, బీఆర్ఎస్ ను బ్రహ్మదేవుడు కూడా కాపాడలేడని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉండేది ఇంకా ఆరు నెలలేనన్నారు. అధికారంలో ఎవరున్నా అభివృద్ధిని ఆపొద్దని సూచించారు. ఏప్రిల్ 8న సికింద్రాబాద్ లో మోడీ సభతో పెను మార్పులుంటాయన్నారు కిషన్ రెడ్డి. ఏప్రిల్ 8న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునర్నిర్మాణం చేస్తున్నామని కిషన్ రెడ్డి వెల్లడించారు. రూ.1400 కోట్లతో జరిగిన డబ్లింగ్ పనులను మోడీ ప్రారంభిస్తారని చెప్పారు. రూ.7764 కోట్లతో చేపట్టే నూతన జాతీయ రహదారులకు ప్రధాని భూమి పూజ చేస్తారని తెలిపారు. ఏప్రిల్ 8న రూ.1366 కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ట్రిపుల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 కోట్లు కేటాయించినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. అనేక అభివృద్ధి పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ఆరోపించారు.ఏప్రిల్ 8న ప్రారంభించనున్న రెండో వందేభారత్ ట్రైన్ వల్ల హైదరాబాద్ టూ తిరుపతి ప్రయాణం మరింత ఈజీ కానుందన్నారు. వందేభారత్ ట్రైన్ వల్ల తిరుపతికి వెళ్లేవారు త్వరగా వెళతారని చెప్పారు.

# జిల్లాన్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ట్రై సైకిల్స్ పంపిణీ



ఖమ్మం,ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలోనాలుగు ట్రై సైకిల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఖమ్మంజిల్లా కొనిజర్లమండలం చిన్నగోపతి గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో బండారు ముత్యాలరావు, బూసి నుగుణమ్మ, వెంకయ్య, అనే దివ్యాంగులకు పారా లీగల్ వాలంటీర్ కోయిన్ని శంకర్రావు చీఫ్ గెస్ట్ గా వచ్చినటువంటి కొనిజర్ల ఎస్ఐ శంకర్ రావు చేతులమీదుగా వారికి ట్రై సైకిల్స్ పంపిణీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్ఐ జక్కుల శంకర్ రావు మాట్లాడుతూ..ప్రజలు మంచి ఆరోగ్య అలవాట్లు అలవర్చుకోవాలని మరియు తల్లితండ్రులు పిల్లలను సరైన పద్ధతిలో పెంచాలని యువత అందరు కూడా మద్యపానానికి డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఎస్ఐ శంకర్ రావు మంచి సందేశం ఇవ్వడం జరిగింది. కోయిన్ని తనుశ్రీ ఎస్ఐకీ ఆమె స్పెషల్ గా తయారు చేసిన బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ కోయిన్ని శంకర్రావు కొనిజర్ల ఎస్ఐ జక్కుల శంకర్ రావు, ఎంపీటీసీ బూర ప్రసాదరావు, ఉప సర్పంచ్ దేరంగుల లక్ష్మయ్య, మాజీ సర్పంచులు పొట్లపల్లి పెద్ద జీడయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఉ పసర్పంచ్ సవల లాలయ్య, వార్డు నెంబర్లు పగడాల వీరస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# వరుస పెట్టి శాటిలైట్లు ప్రయోగిస్తున్న చైనా.. అసలు ప్లాన్ ఏమిటి?

న్యూ డిల్లీ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);చైనా ప్రపంచాన్ని తన గుప్పిట్లోకి తీసుకోవాలని ప్రయత్నిస్తోందా? అంతరిక్షంపై గుత్తాధిపత్యం తోపాటు.. అన్ని దేశాలపై ఉపగ్రహాలతో నిఘా ను ముమ్మరం చేస్తోందా? ప్రపంచ అంతరిక్ష రంగ నిపుణులు, రక్షణ రంగ(పరిశోధకులు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం చెబుతున్నారు. గడిచిన ఆర్నెల్లుగా చైనా వరుసపెట్టి ప్రయోగిస్తున్న ఉపగ్రహాలే ఇందుకు నిదర్శనమంటున్నారు.గత ఏడాది అక్టోబరు నుంచి చైనా తన శాటిలైట్ల ప్రయోగాలను వేగవంతం చేసింది. ఈ ఆర్నెల్లలో(మార్చి చివరికల్లా) ఏకంగా 35 ఉపగ్రహాలను ప్రయోగించింది. ఇవన్నీ లో ఆర్బిట్ శాటిలైట్లే..! భూమికి సమీపంలో ఉ ండే కక్ష్యలోనే తిరుగుతుంటాయి. అంటే.. ఏ దేశంపైనైనా అత్యంత సమీపం నుంచి నిఘాను కొనసాగిస్తున్నట్లే..! ఈ శాటిలైట్లన్నీ హైరిజల్యూషన్ చిత్రాలను చైనాకు చేరవేస్తాయి. ఇలా ఇప్పటి వరకు అంతరిక్షంలో చైనాకు చెందిన 400కు పైగా లో ఆర్బిట్ ఉపగ్రహాలు ప్రపంచ దేశాలపై నిఘాను పెట్టాయి.

**అగ్ర దేశాల ఆందోళన అదే..!**

చైనా లో ఆర్బిట్ ఉపగ్రహాలను వరుసపెట్టి ప్రయోగిస్తుండడం పట్ల అగ్రదేశాలు ఆందోళన చెందుతున్నాయి. వ్యవసాయ పరిశోధనలు, ఇంటర్నెట్ సేవల కోసమే ఈ ప్రయోగాలని చైనా చెబుతున్నా.. రక్షణ రంగ నిపుణులు మాత్రం, చైనా పరమార్థం వేరే ఉ ందని స్పష్టం చేస్తున్నారు. అందుక్కారణం.. 400కు పైగా లో ఆర్బిట్ ఉపగ్రహాల్లో 347 చైనా సైన్యం పరిధిలో ఉన్నాయి. ఉపగ్రహాలపై సైన్యం అజమాయిషీ ఉందంటే.. కచ్చితంగా అవి నిఘా కోసం వినియోగిస్తున్నవేనని రక్షణ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భారత్, అమెరికా సహా.. పలు దేశాల్లో చైనా నిఘా బెలూన్ల ఉదంతాన్ని గుర్తుచేస్తున్నారు. అంతేకాదు.. యుద్ధాలంటూ వస్తే, ఒకప్పటిలా సైనిక బలం ఉన్నవారిదే విజయం అని చెప్పలేమని, ఇప్పుడు స్పేస్‌పై పట్టున్న దేశాలదే విజయం అని చెబుతున్నారు. అందుకే రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో.. రష్యా తొలుత ఉక్రెయిన్ ఎయిర్‌బేస్‌లపై దాడులు చేసి, వాటిని ధ్వంసం చేసిందని వివరిస్తున్నారు. లో ఆర్బిట్ ఉ పగ్రహాలు అణు యుద్ధాల్లో కీలక భూమిక పోషిస్తాయని, ఇప్పుడు చైనా ఆ కోణంలోనే ఎక్కువ మొత్తంలో ఉ పగ్రహాలను ప్రయోగిస్తోందని ఆరోపిస్తున్నారు.

**2027 కల్లా.. చైనాదే గుత్తాధిపత్యం: అమెరికా**

చైనా ఇప్పుడు అంతరిక్షంపై గుత్తాధిపత్యానికి ప్రయత్నిస్తోందని అమెరికా నిఘా సంస్థలు గుర్తించాయి. అర్ధ దశాబ్దం(2027 కల్లా) 13,500 లో ఆర్బిట్ ఉపగ్రహాల ప్రయోగమే చైనా లక్ష్యంగా గుర్తించినట్లు చెబుతున్నాయి. అదేగనక జరిగితే.. యావత్ భూమండలం చైనా నిఘా పరిధిలోకి వస్తుందని, ఏ దేశాన్నైనా శాసించే స్థితికి చైనా చేరే ప్రమాదముందని రక్షణ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా లోఆర్బిట్ శాటిలైట్ల సాయంతో ఉక్రెయిన్ పక్కగా రష్యా సైనికుల జాడను తెలుసుకుని, దాడులు జరుపుతోందని గుర్తుచేశారు. అందుకే.. రష్యా వైపు ఎక్కువగా సైనిక నష్టం ఉందని చెబుతున్నారు.

**పెంటగాన్ నివేదికలో ఆందోళన..!**

అంతరిక్షరంగంలో అమెరికాను అధిగమించేలా చైనా ప్రణాళికలు చేస్తోందని స్వయంగా పెంటగాన్ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. చైనాతో అమెరికా పోటీపడాల్సి వస్తోందని పెంటగాన్‌కు చెందిన 'స్టేట్ ఆఫ్ ద స్పేస్ ఇండస్ట్రియల్-బేస్ రిపోర్ట్-2022' స్పష్టం చేసింది. లేకుంటే.. అమెరికా గగనతలానికి 'చైనా గ్రహణం' పడుతుందని హెచ్చరికలు చేసింది. 2045కల్లా చైనా అంతరిక్ష రంగాన్ని శాసిస్తుందని ఆ నివేదిక అంచనా వేసింది.

# కాలేజీల్లో ఖాళీలు భర్తీ చేయాలి.. సోము వీర్రాజు

అమరావతి, ఏప్రిల్ 4:ఏపీ పాలిటెక్నికల్ కాలేజీల్లో ఖాళీలు భర్తీ చేయాలని ఆరాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ? ఆరు సంవత్సరాలుగా నోటిఫికేషన్ లేదని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 854 పోస్టులు ఖాళీగా ఉ న్నాయన్నారు. ఈ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వం కావాలని కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం ఎవరి సమస్యలనూ పరిష్కరించడం లేదని సోము వీర్రాజు అన్నారు.

# హైదరాబాద్‌లో దారుణం కాలేజీ బిల్డింగ్‌పై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);హైదరాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. కాలేజీ బిల్డింగ్‌పై నుంచి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఇప్పుడు స్థానికంగా కలకలం సృష్టిస్తోంది.వివరాల్లోకి వెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రియాంక నీట్ కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వచ్చింది. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో ఉన్న ఎక్సెల్ కాలేజీలో చేరింది. అక్కడే హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటుంది. ఈ క్రమంలో ఏమైందో ఏమో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో హాస్టల్‌లోని నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు.. ప్రియాంకను ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందిందని వైద్యులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ : మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, ఏప్రిల్ 4: (నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

కరీంనగర్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త గజ్జల దినేష్ కుమార్ రోడ్డు ప్రమాదమలో మరణించగా అతని కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తరపున మంజూరైన బీమా డబ్బులు 2 లక్షల రూపాయల చెక్కును అతని కుటుంబ సభ్యులకు మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం మీ సేవ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చనిపోయిన కార్యకర్త కుటుంబానికి పార్టీ బీమా చెక్కు కొండత భరోసా అన్నారు.

పార్టీ కార్యకర్త చనిపోతే రెండు లక్షల రూపాయల భీమా అందిస్తున్న ఏకైక పార్టీ దేశంలో బీఆర్ఎస్ ఒక్కటే అన్నారు. కార్యకర్తలు లేనిదే నాయకులు లేరనీ, ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు.

# పల్లె ప్రగతితో శాశ్వత అభివృద్ధి పనులు : మంత్రి ఎర్రబెల్లి




జనగాం, ఏప్రిల్ 4: పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా పల్లెల్లో శాశ్వతంగా అభివృద్ధి పనులు చేశామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జనగాం జిల్లా దేవరుప్పుల మండలం చిన్న మడూరులో, దేవరుప్పుల గ్రామాల్లో మంగళ వారం జరిగిన బీఅర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ సందేశాన్ని ఆత్మీయ సమ్మేళనాల్లో చదివి వినిపించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త పంచాయతీరాజ్ చట్టం రావడంతోపాటు, 3,146 గూడాలు, తండాలు కొత్తగా గ్రామ పంచాయతీలు అయ్యాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ గారి దూరదృష్టితో కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులకు సమానంగా రాష్ట్ర నిధులు అందాయని వెల్లడించారు. పల్లె ప్రగతిద్వారా పారిశుధ్యం, వైకుంఠధామాలు, సీసీరోడ్లు, నర్సరీల ఏర్పాటు పెద్ద ఎత్తున జరిగిందని తెలిపారు.రైతులకు సాగునీరు, 24 గంటల విద్యుత్ వల్ల తెలంగాణ సస్యశ్యామలమైందని వివరించారు. ప్రతి గ్రామంలో కోటి రూపాయలతో అభివృద్ధి జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ సమ్మేళనంలో ఎర్రబెల్లి ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్ రావు , ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పదోతరగతి పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి: జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్



ఖమ్మం,ఏప్రిల్ 4: (నేటినిజం ప్రతినిధి): పదో తరగతి పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ స్థానిక నిర్మల్ హృదయ్ హైస్కూల్, ఎన్ఎస్పి కాలనీ ప్రభుత్వ హైస్కూల్ లలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు.పరీక్షల నిర్వహణకు కల్పించిన మౌళిక వసతులు పరిశీలించారు.

విద్యార్థులు పరీక్షా వ్రాయు విధానము, సరళిని పరిశీలించారు.పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్ లను అడిగి తెలుసుకున్నారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్స్ ను ఆదేశించారు.పరీక్షా హాలులో నిరంతర విద్యుత్ సరఫరా,ఫ్యాన్లు,వెలుతురు ఉండాలని, త్రాగునీరు అందుబాటులో ఉ ంచాలన్నారు.పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్ అనుమతించరాదని, సమీపంలో ఎటువంటి జీరాక్స్ సెంటర్లు ఉండరాదని, 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.

పరీక్షా కేంద్రంలోకి చీఫ్ సూపరింటెండెంట్ తో సహా ఎవ్వరికీ సెల్ ఫోన్ అనుమతి లేదని, ఇది ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు.వైద్య శిబిరాన్ని పరిశీలించి, వేసవి దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. సిట్టింగ్ స్క్వాడ్ అప్రమత్తంగా ఉ ండాలని, ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని అన్నారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన ఇంటి అద్దెలు.. డబుల్ బెడ్రూం రూ.50వేలు

హైదరాబాద్, ఏప్రిల్ 4:ఇంటి అద్దెలను భారీగా పెంచుతున్నారట బెంగళూరు ఇంటి యజమానులు. దాంతో ఉద్యోగులు లబో దిబో మంటున్నారు. ప్రపంచంలోని టెక్ సంస్థలు తమ కేంద్రాలను బెంగళూరులో ఏర్పాటు చేసుకున్నాయి. దాంతో బెంగళూరులో ఇంటి అద్దెలు ఆకాశానంటుతున్నాయి.కాగా డబుల్ బెడ్రూం ఇళ్ల అద్దెలకు రెక్కలొచ్చాయి. గతేడాది జనవరితో పోల్చితే ఇప్పుడు రెట్టింపు అద్దెలు వసూలు చేస్తున్నారు. బెంగళూరులో ప్రస్తుతం ఓ డబుల్ బెడ్రూం ఇంటికి నెలకు రూ.50 వేల అద్దె చెల్లించాల్సి వస్తోంది. దేశ రాజధాని ఢిల్లీతో పోల్చితే ఇది ఒకటిన్న రెట్లు అధికం. అంతేకాదు, ఢిల్లీలోని ఓ డబుల్ బెడ్రూం ఇంటితో పోల్చితే బెంగళూరులోని డబుల్ బెడ్రూం ఇల్లు పరిణామంలో సగం కూడా లేదని ఓ ఉద్యోగి వాపోయారు.

బెంగళూరులో 15 లక్షల మంది ఉద్యోగులు నివసిస్తున్నట్టు సమాచారం. కరోనా సంక్షోభం సమయంలో ఉ ద్యోగులందరూ సొంతూళ్లకు వెళ్లిపోయి వర్క్ ఫ్రం హోం విధానంలో పనిచేశారు. కరోనా వ్యాప్తి తగ్గిపోవడంతో ఉద్యోగులు తిరిగి బెంగళూరు చేరుకున్నారు. కరోనా వేళ ఖాళీగా ఉన్న అపార్ట్ మెంట్లు ఇప్పుడు ఫుల్ అయిపోయాయి. దాంతో అద్దె ఇళ్లకు డిమాండ్ ఎక్కువైంది. ఇదే అదనుగా ఇళ్ల యజమానులు అద్దెలు భారీగా పెంచేస్తున్నారు. డిమాండ్ పెరిగిపోయిన నేపథ్యంలో, అందుకు అనుగుణంగా కొత్త ఇళ్ల నిర్మాణం జరగకపోవడమే ఈ ఇంటి అద్దెల పెరుగుదలకు కారణమని అన్ జెన్ స్పేసెస్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ యజమాని అర్పణ్ బత్రా తెలిపారు. కాగా భారత్ కు ఐటీ రాజధానిగా వెలుగొందుతుంది బెంగళూరు.

# 6వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలు బంద్

హైదరాబాద్ ఏప్రిల్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ఈ నెల 6వ తేదీన హనుమాన్ జయంతిసందర్భంగా రాచకొండ పోలీసు కమిషనరేట్పరిధిలో మద్యం దుకాణాలనుమూసివేయాలని సీపీ డీఎస్ చౌహాన్ ఆదేశాలు జారీ చేశారు. 6వ తేదీన ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీన ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్లు, రెస్టారెంట్లు, కల్లు దకాణాలు మూసి ఉంటాయని సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు.

# పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవని : మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, ఏప్రిల్ 4: (నేటినిజం ప్రతినిధి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిరిజన,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్( ఓతినితిబబివతీ రాజీబిఎజీలజీబిష్త్రతి ఖీజీబిష్త్రనీట ) స్పష్టం చేశారు. మంగళవారం మహబూబాబాద్( ఓజీష్త్రజీఎబీఎజీఎజీట )లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 64 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్( అఓఖీఈ ఈబీనిట ) నుంచి మంజూరైన రూ. 25,07,400 విలువ గల చెక్కులను మంత్రి అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని, ప్రజల ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ పేదల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయాలను సీఎం సహాయ నిధి నుంచి అందివ్వడం జరిగిందన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో పాలకులు ఏ రోజు కూడా తెలంగాణ పేదల సంక్షేమం కోసం ఆలోచన చేయలేదని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కేసీఆర్ పేదల బతుకులు మార్చాలన్న ఆలోచనతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తు తరాల బాగుకోసం ఆడబిడ్డలందరూ కేసీఆర్‌ను ఆశీర్వదించాలని వారికి అండగా నిలవాలని మంత్రి కోరారు.

తెలంగాణ రాకముందు రైతులు సాగునీటి కోసం ఎరువుల కోసం కరెంటు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చేదని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని అన్నారు. అందరి సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. అనంతరం చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్‌తో పాటు కొరివి జడ్పీటీసీ బండి వెంకట్ రెడ్డి, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, కొమ్మినేని రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా మెదక్

మెదక్, ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి):మంగళవారం జరుగుతున్న పదవ తరగతి సెకండ్ లాంగ్వేజ్ పరీక్షను జిల్లా కలెక్టర్ రాజర్షి షా మెదక్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విద్యార్థులు పరీక్ష రాస్తున్న విధాన సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను చీఫ్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా హాలులో నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, వెలుతురు ఉండాలని, త్రాగునీరు అందుబాటులో ఉ ంచాలన్నారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికారలు, సెల్‌ఫోన్ అనుమతించరాదని సూచించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పర్యవేక్షించాలని ఇన్విజిలేటర్స్ ను ఆదేశించారు. విద్యార్థులకు కల్పించిన మౌళిక వసతులను పరిశీలించారు. ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఏ.యెన్.ఎం. కు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ద్వితీయ భాషా పరీక్షకు 10,692 మంది రెగ్యులర్, ఒక ప్రైవేట్ విద్యార్థి పరీక్ష వ్రాయవలసి ఉండగా 10,670 మంది విద్యార్థులు అనగా 99.78 శాతం హాజరయ్యారని, కాగా 23 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదని, అన్ని కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అన్నారు. కాగా అదనపు కలెక్టర్ రామాయంపేట లోని వివేకానంద పాఠశాల పరీక్షా కేంద్రాన్ని, జిల్లా విద్యాశాఖాధికారి మెదక్, రామాయంపేట, నిజాంపేట్ లోని కేంద్రాలను, మెదక్ ఆర్.డి.ఓ. మెదక్, రామాయంపేట లోని కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు చేగుంట, నార్సిగి, చిన్న శంకరంపేట, వెల్దుర్తి, అల్లాదుర్గ్, రేగోడ్, పెద్ద శంకరంపేట్ లో ని పరీక్షా కేంద్రాలను పరిశీలించారని, ఎక్కడ ఏ విద్యార్థి డిబార్ కాలేదని, అంతా ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయని కలెక్టర్ తెలిపారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటున్న ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామాత్యులు తన్నీరు హరీష్ రావు

మెదక్, ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి):ఈ నెల 5 రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామాత్యులు తన్నీరు హరీష్ రావు రామాయమపేట్, మెదక్ పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనుటకు విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆయా ప్రాంతాలలో ఏర్పాట్లను ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, రమేష్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి లతో కలిసి పరిశీలించారు. ముందుగా ఔరంగాబాద్ లో నిర్మిస్తున్న నూతన ఎస్పీ కార్యాలయ భవనాన్ని సందర్శించి ఎప్పటి వరకు నిర్మాణాలు పూర్తవుతాయని, కూలీలను అధికంగా పెట్టి పనులు త్వరితగతిన చేయాలని సూపర్వైజర్లను ఆదేశించారు. ఆ తరువాత నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించి చివరి దశలో ఉన్న గార్డెనింగ్ తో మిగిలిపోయిన చిన్న చిన్న పనులను వేగవంతం చేయవలసినదిగా ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రక్టర్లను ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసున్న రేడియాలజీ ల్యాబ్ ను పరిశీలించి ఎక్విప్మెంట్ అంతా వచ్చాయా.. ఫిట్టింగ్ చేశారా..ప్రారంభానికి అంతా సిద్ధం చేశారా అని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ను వివరాలడిగి తెలుసుకున్నారు. చివరగా సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ లో దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ క్రింద 9 అంశాలలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమ ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయో పరిశీలించి, ఎవరికీ ఇబ్బందులు కలగకుండా కుర్చీలు, మంచి నీరు ఏర్పాటు చేయాలనీ జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాకు సూచించారు. అంతకు ముందు రామాయంపేట లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉ త్సవ ఏర్పాట్లు, లబ్దిదారులకు అందించనున్న 304 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవ ఏర్పాట్లను, మౌలిక సదుపాయాల కల్పనను పరిశీలించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సభాస్థలి ఆవరణ అంతా రోడ్ రోలర్ తో చదును చేసి దుమ్ము లేవకుండా నీళ్లు చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. చందు నాయక్, పంచాయత్ రాజ్ ఈఈ సత్యనారాయణ రెడ్డి, జిల్లా పరిషద్ సీఈఓ వెంకట శైలేష్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు, ఆర్.డి.ఓ. సాయి రామ్, తహశీల్దార్ శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# గెల్లు శ్రీనివాస్ కు మంత్రి పువ్వాడ అభినందనలు



ఖమ్మం,ఏప్రిల్ 4: (నేటినిజం ప్రతినిధి): 'తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్' చైర్మన్ నియమితులైన గెల్లు శ్రీనివాస్ యాదవ్ కి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఒక ప్రకటన ద్వారా అభినందనలు తెలిపారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ సిద్ధోగం

-పొన్నం ప్రభాకర్ గౌడ్, ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ విలీన గ్రామమైన తిప్పాపురం రేణుక మాత ఎల్లమ్మ సిద్ధోహంలో కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ గౌడ్, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ లు మంగళవారంపాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ అమ్మవారి దయతో అందరూ ఆయు రారోగ్యాలతో, సుఖసంతో షాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. పాడి పంటలు సమృద్ధిగా పండి రైతుల జీవితాల్లో వెలుగులు ఉండాలని ఆకాంక్షించారు. వారి వెంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, నాగుల విష్ణు ప్రసాద్, నాగుల మహేష్ గౌడ్, ఎర్రం ఆగయ్య, గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# రికార్డ్ స్థాయి ముడి చమురు శుద్ధి ఉత్పత్తులను సాధించిన నుమాలిగర్ రిఫైనరీ లిమిటెడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4:నుమాలిగర్ రిఫైనరీ లిమిటెడ్ (ఎన్ఆర్ఎల్), ఎఫ్‌వై2022–23లో, దాని సామర్థ్యం 3.0 ఓఎంటీలుకి మించి రికార్డ్ స్థాయిలో 3.093 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీ) ముడి చమురు ఉత్పత్తుల శుద్ధిని నమోదు చేసింది. దీంతో పాటు, 87.6% డిస్టిలేట్ ఈల్డ్‌ను కూడా సాధించింది. కంపెనీ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అత్యధికం. ?6,615 కోట్ల మూలధన వ్యయం ద్వారా ఈ ఘనతను ఎన్ఆర్ఎల్ సాధించింది, ఇది కూడా రికార్డ్ స్థాయి. ఎఫ్‌వై2021–22లోని గత రికార్డు అయిన ?3,605 కోట్లను ఇప్పుడు అధిగమించింది.

ఆదర్శప్రాయ పనితీరును లాభాల వృద్ధి రూపంలోకి మార్చిన ఈ కంపెనీ, ఎఫ్‌వై2022–23ని సానుకూలంగా ముగించింది. ఎంఎస్, హెచ్ఎస్‌డీ, మైనం వంటి ప్రధాన రిఫైనరీ ఉత్పత్తులు వరుసగా 662.4 ఎంటీలు, 2,134.8 ఎంటీలు, 47.7 ఎంటీలతో అత్యధిక ఉత్పత్తి గణాంకాలను చూశాయి. ఎల్పీజీ బాట్లింగ్ కూడా రికార్డ్ స్థాయిలో 65.9 టీఎంటీలుగా ఉంది.

2023 మార్చి 18న, భారత్–బంగ్లాదేశ్ ప్రధానమంత్రుల ద్వారా భారత్–బంగ్లాదేశ్ మిత్రత్వ పైప్‌లైన్‌ను విజయవంతంగా ప్రారంభించడం ఆ ఆర్థిక సంవత్సరంలో మరొక ముఖ్యమైన విషయం. ఊఆాని రవాణా చేయడానికి పశ్చిమ బంగాల్‌లోని ఎన్ఆర్ఎల్ సిలిగురి మార్కెటింగ్ టెర్మినల్ నుంచి బంగ్లాదేశ్‌లోని పర్బతీపూర్ వరకు 132 కి.మీ. పైప్‌లైన్‌ను నిర్మించారు. ఈ శుద్ధి కర్మాగారం, తన సామర్థ్యాన్ని 3 ఎంఎంటీపీఏ నుంచి 9 ఎంఎంటీపీఏకి పెంచడానికి సామర్థ్య విస్తరణ ప్రణాళికలో ఉంది. ఒడిశాలోని పారాదీప్ పోర్ట్‌లో ముడి చమురు దిగుమతి టెర్మినల్ ఏర్పాటు, పారాదీప్ నుంచి నుమాలిగర్ వరకు 1,640 కి.మీ. ముడి చమురు పైప్‌లైన్ వేయడం కూడా ఇందులో భాగం. దీంతో పాటు, ఒక జేవీ కంపెనీ ద్వారా వెదురు బయోమాస్‌ను ముడి పదార్థంగా ఉపయోగించుకుంటూ, నుమాలిగర్ వద్ద మొట్టమొదటి జీవ శుద్ధి కర్మాగారాన్ని నిర్మిస్తోంది. ఈ జీవ శుద్ధి కర్మాగారం 2023 చివరి నాటికి ప్రారంభమవుతుందని, 49,000 టన్నుల ఇథనాల్, ఇతర రసాయనాలను ఉత్పత్తి చేస్తుందని అంచనా. 2025 నాటికి పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలపాలన్న దేశ లక్ష్యాన్ని సాధించడంలో ఇది తోడ్పడుతుంది.

కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పురి, తన ట్వీట్ల ద్వారా, ఈశాన్య భారతదేశానికి చెందిన ఈ పీఎస్‌యూ విశిష్ట పనితీరును ప్రశంసించారు.

# మంత్రి కేటీఆర్ చొరవతో అన్ని హంగులతో గూడెం ప్రభుత్వ బడి

-బస్సుల బడి పల్లెవెలుగు, సిటీబస్సుల్లా తరగతి గదులు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఏప్రిల్04 ప్రత్యేక చొరవతో రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా పాఠశాలలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో ముస్తాబాద్ మండలం గూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఇలా ఆకర్షణీయంగా మార్చారు. గివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో మూడు బస్సుల బడిగా మార్చారు. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందని చిత్రకారుడు నారోజు చంద్రశేఖర్ మూడు తరగతి గదులను అందమైన రంగురంగుల పెయింటింగ్స్‌తో మెట్రో, పల్లెవెలుగు, సిటీ బస్సుల్లా తీర్చిదిద్దారు. తమ తరగతి గదులు ఆకర్షణీయంగా ఉండడంతో విద్యార్థులు నిత్యం పాఠశాలకు రావడానికి ఉత్సాహం చూపుతున్నారు.

# దసరా విజయోత్సవ సభ.. పోస్టర్ రిలీజ్ చేసిన మంత్రి




హైదరాబాద్, ఏప్రిల్ 4:ఈ మధ్యకాలంలో తెలంగాణ సంస్కృతిపై..తెలంగాణ యాసలో పలు చిత్రాలు తెరకెక్కి విజయాన్ని అందుకుంటున్నాయి. వాటిల్లో బలగం..దసరా కూడా ఉన్నాయి. కాగా దసరా సినిమా విజయోత్సవ సభ పోస్టర్ ను మంత్రి గంగుల కమలాకర్ ఆవిష్కరించి మాట్లాడారు.తెలంగాణ కుటుంబ నేపథ్యం, బంధాలు అనుబంధాల గురించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిరిసిల్ల కు చెందిన వేణు నిర్మించిన బలగం సినిమా విజయవంతమై కరీంనగర్‌లో విజయోత్సవ సభ నిర్వహించారని గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు గని జీవితాల నేపథ్యంతో తీసిన దసరా సినిమా విజయవంతం అవడం ఈ సినిమా విజయోత్సవ సభ కరీంనగర్ లో జరపడం అభినందనీయమన్నారు. అభివృద్ధి చెందుతున్న కరీంనగర్‌లో సినిమా విజయోత్సవ సభలను జరుపుకోవాలని కోరుకుంటున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో కరీంనగర్ టూరిజం స్పాట్ గా మారనుందన్నారు. తెలంగాణ యాసతో నేచురల్ స్టార్ నాని, కీర్తి సురేశ్ నటించిన దసరా చిత్రం విజయోత్సవ సభ కరీంనగర్‌లోని స్థానిక ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

# తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గెల్లు శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, ఏప్రిల్ 4: తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ నియమించారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామంలో లక్ష్మి, మల్లయ్య దంపతులకు గెల్లు శ్రీనివాస్ 1983, ఆగస్టు 21వ తేదీన జన్మించారు. ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం టీఆర్ఎస్వీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తండ్రి గెల్లు మల్లయ్య కొండపాక ఎంపీటీసీగా పని చేశారు. తల్లి లక్ష్మి హిమ్మత్‌నగర్ సర్పంచ్‌గా సేవలందించారు. ఇక గెల్లు శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ తరపున హుజురాబాద్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయిన సంగతి తెలిసిందే.

రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన శ్రీనివాసయాదవ్.. డిగ్రీ (బీఏ) చదువుతున్నప్పటినుంచే విద్యార్థి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. హైదరాబాద్ అంబర్‌పేటలోని ప్రభుత్వ బీసీ హాస్టల్లో ఉంటూ.. 2003–2006 మధ్య టీఆర్ఎస్వీ ఏవీ కాలేజీ శాఖకు అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థుల సమస్యలపై పోరాడారు. విద్యార్థుల ఫీజు పెంపు నిర్ణయానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో శ్రీనివాస్ యాదవ్ కీలకపాత్ర పోషించారు. ఫీజు పెంపును వ్యతిరేకిస్తూ ఏవీ కాలేజీల్లో నడిపిన ఉద్యమంలో శ్రీనివాస్ యాదవ్ అరెస్టు కూడా అయ్యారు. చివరకు కాలేజీ యాజమాన్యం ద్వారా ఫీజు రీయంబర్స్‌మెంట్ సాధించడంలో ఆయన విజయం సాధించారు. 2003– 2006 మధ్య టీఆర్ఎస్వీ హైదరాబాద్ పట్టణ కార్యదర్శిగా గెల్లు శ్రీనివాసయాదవ్ పనిచేశారు. బొమ్మ రామ్మూర్తి, బాబా ఫసీయుద్దీన్ నాయకత్వంలో ఆయన ఉద్యమాల్లో పాల్గొన్నారు. 2003–2004 విద్యాసంవత్సరంలో బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఇందిరాపార్కులో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వ్యతిరేకంగా శ్రీనివాస్ యాదవ్ ధర్నాలు నిర్వహించారు. 2004 డిసెంబర్లో విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ అప్పటి ఆర్థికమంత్రి కొణిజేటి రోశయ్య ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ అరెస్టు కూడా అయ్యారు.

# సీపీఎంపై షర్మిల విమర్శలు.. తమ్మినేని ఆగ్రహం..

హైదరాబాద్, ఏప్రిల్ 4: నిరుద్యోగుల సమస్యలపై ఆందోళనకు సిద్ధమవుతున్న వైఎస్ఆర్టీపీ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఇతర పార్టీల మద్దతు కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నేటి ఉదయం తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్ తో చర్చలు జరిపారు. అనంతరం హైదరాబాద్ లో సీఎం కార్యాలయానికి ఆమె వెళ్లారు. అక్కడ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఇతర నేతలతో నిరుద్యోగుల సమస్యలపై చర్చించారు. యువతకు ఉపాధి కల్పించడం కోసం అందరం కలిసికట్టుగా పోరాడుదామని ఆమె కోరారు.

ఆ తర్వాత సీపీఎం నేతలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. సీపీఎం పార్టీ బీఆర్ఎస్ పార్టీకి బీ టీమ్ గా వ్యవహరిస్తోందని ఎత్తిపొడిచారు. తాను కానీ, తమ పార్టీ కానీ బీజేపీకి ఎప్పుడూ బీ టీమ్ కాదని, కేంద్రంలోని బీజేపీని విమర్శిస్తున్న పార్టీ తమదని చెప్పుకొచ్చారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ? షర్మిల వ్యాఖ్యలను తప్పుబట్టారు. తమ కార్యాలయానికి వచ్చి.. తమ పార్టీపై విమర్శలు చేయడం ఏమిటంటూ మండిపడ్డారు. తమకు సంస్కారం ఉందని, షర్మిల లా తాము మాట్లాడలేమని, నిష్టూరమాడారు. పార్టీ కార్యాలయానికి వస్తామంటూ షర్మిల ఫోన్ చేయడంతో ఆహ్వానించామని, అయితే తమ పార్టీ విధానాలనే ప్రశ్నించడం తమకు అసంతృప్తి కలిగించిందని పేర్కొన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బాహాటం గానే అధికార పార్టీకి మద్దతు ప్రకటించి, ప్రచారం కూడా చేశామని, ఇందులో ఎటువంటి దాపరికం లేదని చెప్పారు. కానీ షర్మిల మాత్రం తమ పార్టీపై అనవసరమైన నిందలు వేయడం బాధించిందన్నారు.

# పేదలకు ఆసరాగా హిరా ఫౌండేషన్ కరీంనగర్ సేవలు

-పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సరకుల పంపిణీ

-గ్రామాల్లో మసీదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన

-పేద విద్యార్థులకు విద్యాభ్యాసం, ఉచిత వసతి

-చైర్మన్ షేక్ అబూబకర్ ఖాలీద్ తోపాటు పలువురు దాతల ఆర్థిక మద్దతు

-హిరా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముఫ్తీ ఖియాస్ మొహియుద్దీన్ వెల్లడి




కరీంనగర్, ఏప్రిల్ 4: (నేటినిజం ప్రతినిధి): పేదలకు ఆర్థిక చేయూతనందిస్తూ, వారి ముఖాల్లో కొత్త వెలుగులు తీసుకొస్తోంది హిరా ఫౌండేషన్ కరీంనగర్.. ముస్లింలు అత్యంత పర్వదినంగా భావించే పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆ నెలంతా పండగలా భావిస్తారు. కానీ తామున్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఒక్కరోజు పండుగ జరుపుకోవడమే కష్టంగా భావించే పేద వర్గాలకు రంజాన్ మాసానికి సరిపడా నిత్యావసర వస్తువులను అందించి వారి ముఖాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. ఈ సంస్థ... ముఖ్యంగా గ్రామీణ ప్రాం తాల్లోని పేద కుటుంబాలకు ఆసరగా నిలుస్తూ గ్రామాల్లో కొత్తగా నిర్మాణాలు, ఇప్పటికే ఉన్న మసీదుల్లో మంచినీరు తదితర మౌలిక వసతుల కల్పనకు తోడ్పాటునందిస్తోంది. సంస్థ స్థాపించిన 18 సంవత్సరాలుగా హిరా ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు, ఫౌండేషన్ చైర్మన్ షేఖ్ అబూ బకర్ ఖాలీద్ తో పాటు పలువురు దాతలు ఆర్థిక సాయం అందిస్తూ తోడ్పాటు నందిస్తున్నట్లు ట్రస్టీ ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ తెలిపారు.

రంజాన్ మాసంలో :

నిరు పేదలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో పేద కుటుంబాల వారికి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులు అందిస్తున్నారు. 2005లో సంస్థ స్థాపించినప్పటి నుంచి నేటి వరకు గత 18 సంవత్సరాల్లో ఏటా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 2 వేల కుటుంబాలకు చేయూ తనందిస్తున్నారు.

మస్జిద్లలో మౌలిక వసతుల కల్పన

ప్రతి రంజాన్ మాసం పురస్కరంచుకొని గ్రామీణ ప్రాంతాల్లోని మసీదుల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నారు. మసీదులే లేని గ్రామాల్లో కొత్తగా నిర్మాణాలు సైతం చేపడుతున్నారు. అంతే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని మస్జిద్ లలో పనిచేసే ఇమామ్లకు వేతనాలందిస్తున్నారు.

వింతంతు, దివ్యాంగులకు పింఛన్లు:

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద వర్గాలకు చెందిన వితంతువులు, దివ్యాంగులతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలను గుర్తించి నెల, నెలా కొంత మొత్తాన్ని వారికి పింఛన్లుగా అందించి వారికి ఆర్థిక చేయూత నందిస్తూ అండగా నిలుస్తున్నారు.

ఉచిత విద్య, వసతి:

గ్రామీణ ప్రాంతా ల్లో నివసించే పేద కుటుంబాలకు చెందిన బాలబాలికలతో పాటు, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేద కుటుం బాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య నందిస్తు న్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి యువతకు ఉచిత కుట్టు శిక్షణ ఇప్పిస్తున్నారు. బాలబాలికలకు విద్యతో పాటు అవసరమైన వారికి ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

జకాత్ ద్వారా ఆర్థిక వెసులుబాటు :

రంజాన్ సందర్భంగా సంపన్న కుటుంబాల వారు జకాత్ పాటిస్తారు. జకాత్ అంటే తాము సంపాదించిన దాంట్లో రెం డున్నర శాతం పేద వర్గాలకు ఖర్చు చేయాలి. ఇలా జకాత్ ద్వారా ఏటా సంస్థకు కొంత నిధులు వస్తాయని, హిరా సంస్థ చైర్మన్ సహా పలువురు దాతలు సంస్థ నిర్వహణకు ఇతోధికంగా ఆర్థిక సాయం అందిస్తున్నారని మేనేజింగ్ ట్రస్టీ ముఫ్తి ఖియాస్ మొహియుద్దీన్ తెలిపారు.

ఉచితంగా అన్నదాన కార్యక్రమం,.

అంతేకాకుండా ప్రతీ సోమ, గురువారాల్లో నగరంలోని మాతాశిశుసంక్షేమ ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణుల కోసం సహాయంగా వచ్చే సుమారు 300 మంది కుటుంబసభ్యులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుస్తారు.

# నూతనంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జికి హజ్రత్ షేర్అలీ బాబా బ్రిడ్జిగా పేరు పెట్టాలి

-ఎన్టీఆర్ విగ్రహం నుండి మానేరు డ్యాం రోడ్డు మీదుగా వేములవాడ వెళ్లే బైపాస్ లో ఎల్ఈడీ లైట్లకు త్రిశూలాలు అమర్చడాన్ని స్వాగతిస్తున్నాము

-నగరంలో ప్రభుత్వ అధికారిక, సూచికల బోర్డులపై ఉర్దూలో పేర్లు పెట్టాలి

-అధికారిక సూచిక బోర్డులపై ఉర్దూలో వ్రాయించేలా చొరవ తీసుకోవాలని మేయర్ కు ఎంఐఎం నేతల వినతి



కరీంనగర్, ఏప్రిల్ 4: (నేటి నిజం ప్రతినిధి): నగర శివారులోని మానేరు వాగు ఒడ్డుపై ఉన్న హజ్రత్ షేర్ అలిబాబా రహ్మేతుల్లాహ్ అలైహి పేరును.. నూతనంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జికి షేర్అలి బ్రిడ్జిగా పేరు పెట్టాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటి సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ బోయినిపల్లి వినోద్ కుమార్, మేయర్ సునీల్ రావులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ లో అన్ని ప్రభుత్వ అధికారిక సూచిక బోర్డులపై తెలంగాణ రాష్ట్ర రెండో అధికార భాషగా ఉన్న ఉర్దూలో పేర్లను వ్రాయించేలా చర్యలు చేపట్టాలని మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ సునీల్ రావును కలిసి గులాం అహ్మద్, ఎంఐఎం కార్పొరేటర్లు, తెలంగాణ యూనియన్ ఆఫ్ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఓ వైపు బిజెపి ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం గడచిన 9సంవత్స రాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ను, ప్రభుత్వ ఆస్థులను అభివృద్ధి పేరిట ప్రయివేటుకు అమ్మేస్తూ, ధారాదత్తం చేస్తుంటే, సీఎం కేసీఆర్, బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నవ తెలంగాణ ను నిర్మిస్తూ, దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నార న్నారు. ఇందుకు రాష్ట్రంలో గడచిన 8సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధే నిదర్శనమన్నారు. ఇక ఎన్టీఆర్ విగ్రహం నుండి ఉజ్వల పార్క్ మీదుగా వేములవాడ వెళ్లే బైపాస్ రోడ్ లో సెంట్రల్ లైటింగ్ విద్యుత్ పోళ్లపై త్రిశూలాలు అమర్చినట్లు గానే, దశాబ్దాల చరిత్ర కలిగిన షేర్అలీ బాబా దర్గాహ్ కు హిందూ, ముస్లిం లు ఐక్యతగా వెళ్లి దర్శించుకుంటారని, అనాదిగా షేర్ అలీ గడ్డగా పిలువబడే ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన కేబుల్ బ్రిడ్జికి షేర్ అలిబాబా పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు

. అటు త్రిశూ లాలు, ఇటు షేర్ అలిబాబా పేరు పెడితే, గంగా జమున తెహజీబ్ కు ప్రతిరూపంగా, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో సర్వ మతాలకు ఏవిధంగా నైతే ప్రాధాన్యత ఇస్తుందో, అలానే ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే దేశంలోనే సెక్యులర్ నగరంగా కరీం నగర్ పేరు చరిత్రలో నిలుస్తుం దన్నా రు. తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా కేసీ ఆర్ సర్కార్ ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తించి అధికార భాష యాక్ట్ 1966, జీవో ఎంఎస్ నెంబర్ 45ను అమలు చేస్తుంటే కరీం నగర్ లో మాత్రం, ప్రభుత్వ ఆలోచ నకు విరుద్ధంగా ఉర్దూను తొక్కి పెడు తున్న అదృశ్య శక్తి, కారకుడు ఎవరని, ఎవరి భయంతో, ఎవరి ప్రోద్భలంతో ఉర్దూ వెనక్కి నెత్తివే యబడుతోందని ప్రశ్నించారు. నగరం లో ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై, కాలనీల సూచికల బోర్డులపై, బస్టాం డ్ నుంచి మొదలు, రైల్వే స్టేషన్ వరకు ఎక్కడా ఉర్దూలో పేర్లు కనిపించ వన్నారు. అసలు సెక్యులర్ ముసుగులో లోపాయకారి స్వంత ఎజెండా అమలు, కంటగింపు, ఈర్ష్య, ద్వేషం ఉర్దూ భాష పైనా లేక, ప్రభు త్వం జారీ చేసిన జీవో 45పైనా, పాపం చేసింది ఉర్దూ బాషనా లేక ముస్లిం కాలనీల అర్థం కానీ దుస్థితి ఏర్ప డిం దన్నారు. రాబోయే 15 రోజుల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని అన్ని సూచికల బోర్డులపై ఉర్దూ లో పేర్లను వ్రాయి ంచకుంటే రంజాన్ మాసం తర్వాత, నగర వ్యాప్తంగా ముస్లిం సమాజాన్ని జాగృతం చేసి పెద్దఎత్తున ఆందోళన లు చేపడుతామని హెచ్చరిం చారు. ఈ అంశాలపై మంత్రి గంగు లతో పాటు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మ న్ బోయినిపల్లి వినోద్ కుమార్ లను కలిసి ఎంఐఎం పక్షాన వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు.

ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖీల్ ఫిరోజ్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అలిబాబా, అజర్ దబీర్, ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం నాయకులు నిసార్ అహ్మద్, అసగర్ హుస్సేన్, షాకిర్, షీరాజ్, ఫయాజ్, అబ్దుల్ రహమాన్, ఫయాజ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.